

ఆన్‌లైన్ మోసాలు, సైబర్‌నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ బోస్‌కిరణ్, డీఐ ఆర్. వెంకటేశ్వర్లు, ఎస్ఐ నర్సింహ

ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కవాడిగూడ. డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని గాంధీనగర్ సీఐ బోస్ కిరణ్ సూచించారు. మంగళవారం కవాడిగూడ ఎస్‌బీఐ కాలనీలో గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోసాలు, నేరాలపై రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. సీఐ మాట్లాడుతూ మొబైల్ ఫోన్‌లకు వచ్చే అపరిచిత మెసేజ్‌లకు స్పందించొద్దన్నారు. ఏపీకే ఫైల్స్ వస్తే ఓపెన్ చేయొద్దన్నారు. కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఆర్. వెంకటేశ్వర్లు, సెక్టార్ ఎస్ఐ నర్సింహులు, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆలయ చైర్మన్ జానకి సుధాకర్‌కు వెండిని అందజేస్తున్న ధర్మకర్త హరీష్

ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి చర్యలు

చిక్కడపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చైర్మన్ జానకి సుధాకర్ తెలిపారు. ఆలయ ధర్మకర్త హరీష్, కుటుంబసభ్యులు ఆలయ గర్భగుడిలో పంచలోహాలతో ఏర్పాటు చేయనున్న సుందరకాండ చిత్రాలతో కూడిన తాపడం కోసం మంగళవారం తమవంతుగా కిలో వెండిని చైర్మన్ సుధాకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మాచర్ల దేవనాథం, సీనియర్ అర్చకుడు కందాళ వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న వల్లభనేని ప్రసాద్

రాంనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్ రాష్ట్ర కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, కో-కన్వీనర్ కాటంనేని వెంకటేష్ డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లిలోని కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడారు. దివ్యాంగుల చట్టాన్ని అన్ని శాఖల్లో అమలు చేయాలన్నారు. దివ్యాంగులకు ఇచ్చే పింఛన్‌ను రూ. 6 వేలకు పెంచాలని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో దివ్యాంగులకు 5 శాతం కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు.



మోహన్‌నగర్‌లో పబ్లిక్ నల్లా వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలతో మాట్లాడుతున్న పూస గోరఖ్‌నాథ్

పబ్లిక్ నల్లాలను తొలగించొద్దు

ముషీరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో పబ్లిక్ నల్లాలను తొలగించవద్దని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పూస గోరఖ్‌నాథ్ జలమండలి అధికారులను కోరారు. స్థానికుల ఫిర్యాదు మేరకు మోహన్‌నగర్‌లో పబ్లిక్ నల్లాలను ఆయన పరిశీలించారు. కుమ్మరి సంఘం, మోహన్‌నగర్, అజార్‌గల్లీ, పటాన్‌బస్తీ, బాపూజీనగర్‌లో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న పబ్లిక్ నల్లాలను తొలగించవద్దన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

తెన్నేటి సుధాదేవి సాహితీ సేవలు విలువైనవి

చిక్కడపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత్రి డా. తెన్నేటి సుధాదేవి సాహితీ, సాంస్కృతికరంగ సేవలు విలువైనవని యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ అన్నారు. స్వరమాధురి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో సినీ సంగీత విభావరి సంస్థ అధ్యక్షురాలు, ప్రముఖ గాయని సాయిపావని ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సుధాదేవికి ఘనంగా నివాళులర్పించారు. ప్రముఖ నటుడు నాగేందర్ తదితరులు పాల్గొన్నారు. సాయిపావని, వెంకీ, అర్చన, రీట, రాము, ప్రసాద్, శిరీష, చిరంజీవి, శ్రీరామమూర్తి, వాసు, రమణ, వెంకటలక్ష్మి రామ్, ద్రోణంరాజు సిరి గీతాలను మధురంగా ఆలపించారు.

● మర్రి చెన్నారెడ్డికి నివాళి



మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం ఇందిరాపార్కులోగల ఆయన సమాధి వద్ద కాంగ్రెస్, బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడెల్లి అజయ్‌కుమార్, హైదరాబాద్ జిల్లా కార్యాలయ కార్యదర్శి మూల రవీందర్‌గౌడ్, నాయకులు రవిప్రసాద్‌గౌడ్, నేమలి ఆనంద్, కాంగ్రెస్ నాయకులు జీఎస్.కేశవ్, శ్రీరాములు యాదగిరి పాల్గొన్నారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి

తాగునీటి సమస్య పరిష్కారానికి

పైపులైన్‌ల ఆధునికీకరణ

బర్కత్‌పుర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి పైపులైన్‌ల ఆధునికీకరణ పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. వచ్చే వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. మంగళవారం కాచిగూడ డివిజన్ మేదర బస్తీ నుంచి చప్పల్‌బజార్ వరకు రూ. 15 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న పైపులైన్ పనులను కార్పొరేటర్ కన్నె ఉమాదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పైపులైన్ నిర్మాణంతో మేదరబస్తీ, చప్పల్‌బజార్ పరిసర ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మాదేవ్, సీనియర్ నాయకుడు డాక్టర్ బద్దుల ఓంప్రకాష్ యాదవ్ బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు సుభాష్‌పటేల్, భీమ్‌రాజ్, బల్వీర్ తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ మేదర బస్తీలో పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి





వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి

కవాడిగూడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని ఎస్‌వీ ఫౌండేషన్ చైర్మన్ పోచంపల్లి సుధీర్‌రెడ్డి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. మంగళవారం ఏవీ కళాశాలలో ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో ఓయూ పరిధిలోని 40 కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. రెండు రోజులపాటు పోటీలు జరగనున్నాయి. కార్యక్రమంలో ఏవీ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ రమావత్ ప్రకాష్, చీఫ్ ప్యాట్రన్ కరస్పాండెంట్ డాక్టర్ కె. గౌతమి, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ఐసీటీ ఓయూ సెక్రటరీ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్, ఏవీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజలింగం, పీజీ డైరెక్టర్ డాక్టర్ కె. భగవంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే మూత్ర విసర్జన

● అంబర్‌పేటలో సులభ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు

అంబర్‌పేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట మున్సిపల్ సర్కిల్-16 పరిధిలో మూత్రశాలలు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేట, గోల్నాక డివిజన్ల పరిధిలో మూత్రశాలలు లేకపోవడంతో రోడ్లపైనే మూత్ర విసర్జన చేస్తున్నారు. గోల్నాక నుంచి అంబర్‌పేట వైపు వెళ్లే ప్రధాన రహదారిపై దాదాపు రెండు కిలోమీటర్ల వరకు ఒక్క మూత్రశాల కూడా లేకపోవడంతో ఫ్లైఓవర్ కింద ఖాళీ స్థలంలో మూత్ర విసర్జన చేస్తున్నారు. గతంలో అంబర్‌పేట ఎలక్ట్రిసిటీ కార్యాలయం పక్కన మూత్రశాల ఉండగా నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మూతపడింది. దీంతో సీపీఎల్ రోడ్డుపై మూత్ర విసర్జన చేస్తున్నారు. అలీకేఫ్ నుంచి గోల్నాకకు వెళ్లే రోడ్డులో కూడా మూత్రశాలలు లేవు. సులభ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎక్కడపడితే అక్కడ మూత్ర విసర్జన చేస్తున్నారు



అంబర్‌పేట పరిధిలో సులభ్ కాంప్లెక్స్‌లు లేకపోవడం వల్ల రహదారులపై రాకపోకలు సాగిస్తున్న వారు ఎక్కడపడితే అక్కడ మూత్రవిసర్జన చేస్తున్నారు. దుర్వాసన వస్తోంది. సులభ్ కాంప్లెక్స్‌ల ఏర్పాటుకు జీహెచ్‌ఎంసీ చర్యలు తీసుకోవాలి.

- రూబీ స్టీవెన్సన్, ప్రేమ్‌నగర్ నివాసి

టెండర్లు ఆహ్వానించాం

అంబర్‌పేట మున్సిపల్ సర్కిల్ పరిధిలో మూత్రశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. టెండర్లు ఆహ్వానించాం. పాలిటెక్నిక్ కాలేజీ, గోల్నాక కమేలా వద్ద మూత్రశాలల ఏర్పాటుకు టెండర్లు ఖరారయ్యాయి. గుర్తించిన ప్రాంతాల్లో మూత్రశాలల ఏర్పాటుకు టెండర్లను ఆహ్వానిస్తాం.

- డాక్టర్ హేమలత, ఏఎంవోహెచ్, అంబర్‌పేట సర్కిల్

సంజయ్‌గాంధీనగర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి

గోల్నాక, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): సంజయ్‌గాంధీనగర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు అన్నారు. మంగళవారం బీజేపీ నాయకులతో కలిసి బస్తీలో పర్యటించారు. ప్రభుత్వం రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఇళ్ల పైకప్పు పెచ్చులూడుతున్నాయని, ఇటీవల కురిసిన వర్షాలకు బాల్కనీలు కూలాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. భవనాలను గౌతమ్‌రావు స్వయంగా పరిశీలించారు. సమస్యలను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు సూదగాని శ్రీధర్‌గౌడ్, సెంట్రల్ జిల్లా కార్యాలయ కార్యదర్శి మూల రవీందర్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేసరి నర్సింగ్‌రావు యాదవ్, నాయకులు ఆర్‌వీఎల్ రమేష్, కె. రవీందర్, బి. ఈశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సంజయ్‌గాంధీనగర్‌లో పర్యటిస్తున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, నాయకులు

దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలి

చిక్కడపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలని ఎంసీపీసీ అధ్యక్షుడు సీఏ డానియేల్ ఆడమ్స్ డిమాండ్ చేశారు. క్రైస్తవులపై జరుగుతున్న వరుస దాడులను నిరసిస్తూ న్యూఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించామని తెలిపారు. నిరసనలో దేశవ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు పాల్గొన్నారని తెలిపారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌ను రద్దు చేయాలన్నారు.

● అన్నదానం



ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో సంధ్య థియేటర్ సమీపంలో పకోడి షాప్ నిర్వహించే సన్నీ, థియేటర్ సిబ్బంది మంగళవారం అమ్మవారి ఆలయం వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రెండువందల మందికి అన్నదానం చేశారు.

- చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి

1/70 చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలి

● బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ, గిరిజనుల భూములకు 1/70 చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మన బోయిన సైదులు యాదవ్ డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మంగళవారం ఆదివాసీ, గిరిజన భూముల రక్షణకు సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1/70 చట్టం అమలు చేయడంలో కేంద్రం తీవ్ర జాప్యం చేస్తోందని విమర్శించారు. అటవీ సంపదను కార్పొరేట్ వ్యవస్థలకు అప్పగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పాలడుగు శ్రీను, ఆజాద్, ఆసిఫ్, నవీన్, శ్రీధర్ యాదవ్, శ్రవణ్, లక్ష్మణ్, కోలా శేఖర్, అచ్యుత్, ప్రసన్న, సుభాష్, వినయ్, భరత్, మనోజ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల చట్టం అమలు చేయాలి



పోలీసు శాఖలో దివ్యాంగుల హక్కుల చట్టం - 2016 అమలు చేయాలని అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు కోరారు. డీజీపీ శివధర్‌రెడ్డిని మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి

పంచాయతీ ఎన్నికల్లో

మున్నూరు కాపుల గెలుపునకు కృషి

చిక్కడపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన వారి గెలుపునకు కృషి చేస్తామని తెలంగాణ మున్నూరుకాపు యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆరె మహేందర్ పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాలకు వెళ్లి వారి గెలుపుకోసం ప్రచారం చేస్తామన్నారు. పోటీ చేస్తున్న వారి వివరాలను 9603708535 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని కోరారు.



భూంపల్లి అశోక్‌దాదాకు నియామక పత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

బీసీ జేఏసీ కన్వీనర్‌గా అశోక్‌దాదా నియామకం

రాంనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్‌గా భూంపల్లి అశోక్‌దాదా నియమితులయ్యారు. మంగళవారం విద్యానగర్‌లో బీసీ భవన్‌లో జేఏసీ చైర్మన్ ఆర్. కృష్ణయ్య ఆయనకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆరెకటిక అభివృద్ధి సంఘం లీగల్ అడ్వయిజర్ కె.సాయిదాదా, జాయింట్ సెక్రటరీ జె.శ్రీనివాస్‌దాదా, సభ్యుడు చింటు పాల్గొన్నారు.

పల్లెటూరు రచనలను అక్షరబద్ధం చేశా

'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో నాటక రచయిత్రి విజయలక్ష్మి



చిక్కడపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కథ, నవల, నాటక రచయిత్రి అత్తలూరి విజయలక్ష్మి సాహితీ స్వర్ణోత్సవ మహోత్సవం- అవార్డు ప్రదానసభ ఈనెల 6న వంశీ ఆర్ట్ థియేటర్స్, లేఖిని రచయిత్రుల వేదిక సంయుక్తాధ్వర్యంలో త్యాగరాయగాన సభలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అత్తలూరి విజయలక్ష్మితో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ.

ప్రశ్న: సాహితీస్వర్ణోత్సవం జరుపుకుంటున్నారు, ఎప్పటి నుంచి కథలు రాయడం మొదలు పెట్టారు. మొదటి కథ ఏది?

జవాబు: 1974 నుంచి రాస్తున్నాను. మొట్టమొదటి కథ పల్లెటూరు. ఆంధ్రప్రదేశ్‌లోని పొందుగుల అనే ఊరికి వెళ్లి ఆ పల్లెటూరు అనుభవాలను రచనగా అక్షరబద్ధం చేశాను.

ప్రశ్న: పత్రికలో ప్రచురించిన కథలు ఉన్నాయా?

జవాబు: జ్యోతి పత్రికకు నా కథలు పంపించాను. అవి ప్రచురితమయ్యాయి.

ప్రశ్న: మీ కథలు ఎన్ని వెనక్కి వచ్చాయి

జవాబు: మూడున్నర దశాబ్దాలుగా ఒక్క కథ కూడా తిరిగి రాలేదు.

ప్రశ్న: రేడియో నాటకాలు రాశారా?

జవాబు: రాశాను. అవి రేడియోలో ప్రసారం అయ్యాక గొప్ప గొప్ప రచయితలతో పాటు నా నాటకాలు కూడా రేడియోలో ప్రసారం కావడం గొప్ప అనుభూతి.

ప్రశ్న: రంగస్థల నాటకాలు ఎప్పుడు ప్రారంభించారు. నాటకాలపై ఆసక్తి ఎలా కలిగింది.

జవాబు: నాన్నగారితో కలిసి చిన్నప్పుడు రవీంద్రభారతి, వైఎంసీఏలో నాటక ప్రదర్శనలు జరుగుతుండగా చూడ్డానికి వెళ్లేదాన్ని. నాటక ప్రదర్శనలు జరిగినప్పుడు చప్పట్లతో ప్రేక్షకులు స్పందించడం నన్ను ఆకర్షించింది. అందుకే రంగస్థల నాటకాల రచనకు శ్రీకారం చుట్టాను. భగవంతుడు శక్తి ఇస్తే తప్పకుండా రచనా ప్రస్థానం కొనసాగిస్తాను. కీర్తి అనేది నెమ్మదిగా వచ్చి శాశ్వతంగా నిలుస్తుంది. ఇదే కొత్తవారికి నా సలహా. బహుమతులు, పురస్కారాల కోసం ఎప్పుడూ రచనలు చేయలేదు. అవే నా దగ్గరకు వచ్చాయి.



హైవే అథారిటీ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్

అంబర్‌పేటలో సర్వీస్ రోడ్డు నిర్మించాలి

అంబర్‌పేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేటలో సర్వీస్ రోడ్డు నిర్మించాలని హైవే అథారిటీ అధికారులను కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ కోరారు. మంగళవారం అంబర్‌పేట డివిజన్ పరిధిలో సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతూ నేషనల్ హైవే అథారిటీ అధికారులతో ఆయన మాట్లాడారు. ఫ్లైఓవర్ నిర్మాణం తర్వాత సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కార్పొరేటర్ కోరారు.

హెచ్‌ఐవీ బాధితులకు అండగా ఉండాలి : కాలేరు

గోల్నాక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ బాధితులకు అండగా మేమున్నామని వారికి సహాయ సహకారాలు అందిస్తున్న బేతెల్ గాస్పెల్ చర్చి సేవా నిరతి గొప్పదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గోల్నాక డివిజన్ అన్నపూర్ణనగర్‌లో గల బేతెల్ చర్చి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా 350 మంది హెచ్‌ఐవీ బాధితులకు ఉచితంగా మందులు, నిత్యావసర వస్తువులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. బాధితులకు అందరూ అండగా ఉండాలని కాలేరు సూచించారు. కార్యక్రమంలో కె. సుధాకర్, జి.వరకుమార్, చర్చి సిబ్బంది, గో-ఇండియా సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌వోసీ పత్రం అందజేత

గోల్నాక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కృష్ణానగర్‌కు చెందిన మహ్మద్ రషీద్ ఖురేషీ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోగా రూ. 2 లక్షలు మంజూరయ్యాయి. మంగళవారం లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ) పత్రాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆయన బంధువులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు పట్వారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



జమిస్తాన్‌పూర్ గౌడ సంఘం కార్యవర్గం సభ్యులు

జమిస్తాన్‌పూర్ గౌడ సంఘం కార్యవర్గం

ముషీరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జమిస్తాన్‌పూర్ గౌడ సంఘం అధ్యక్షుడిగా రంగా కృష్ణగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శిగా పరకాల వేణుబాబుగౌడ్, సంయుక్త కార్యదర్శిగా రాముగౌడ్, కోశాధికారిగా కర్ల ప్రకాష్‌గౌడ్, డైరెక్టర్లుగా వెంకటేష్‌గౌడ్, దయానంద్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, కె.బాలమల్లేష్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు.

కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో

తాగునీటి సౌకర్యం కల్పించాలి : ఐఎన్‌టీయూసీ

చిక్కడపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయానికి వచ్చే కార్మికుల సౌకర్యార్థం తాగునీటి సౌకర్యం కల్పించాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి దేవసాని భిక్షపతి విజ్ఞప్తి చేశారు. ఆర్‌వో ప్లాంట్ నిర్మించి ఏడాది అవుతున్నా వినియోగంలోకి తీసుకురాలేదన్నారు.

● బాడీ బిల్డర్స్‌కు సన్మానం



మియాపూర్‌లో గతనెల 30న జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో మొదటి బహుమతి పొందిన వినోద్, కన్సొలేషన్ బహుమతి పొందిన అబ్బాస్, నవాజ్ తదితరులను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ ముషీరాబాద్ మైనారిటీ కమిటీ అధ్యక్షుడు పర్వేజ్

- ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి

ఉన్నత విద్యావకాశాలపై అవగాహన

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలోని హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ (హెచ్‌సీడీసీ), జీఈసీఎఫ్ సంయుక్తంగా కెనడా యూనివర్సిటీ ఆఫ్ విండ్సర్‌లో ఉన్నత విద్యావకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు విదేశీ విద్య, ఇంటర్న్‌షిప్ అవకాశాలపై అవగాహన కల్పించడమే లక్ష్యమని హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయా చరణ్, కో-ఆర్డినేటర్ డా. సూర్యవల్లి తెలిపారు. విండ్సర్ విశ్వవిద్యాలయానికి చెందిన డా.క్రిస్ బుష్ డిమాండ్ ఉన్న కోర్సులు, రీసెర్చ్ సదుపాయాలు, స్కాలర్‌షిప్‌లు, అడ్మిషన్ ప్రక్రియపై విద్యార్థులకు వివరించారు.